సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 8 । జూలై । 2024



ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ల సందడి
ఇంజనీరింగ్ అడ్మిషన్లకు కళాశాలలు సిద్ధమవుతున్నాయి. మొత్తం 15 కళాశాలల్లో 12వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 22 వరకు అడ్మిషన్ల ప్రక్రియ జరగనుంది. 8లో



ఎంటీయూ 1318దే హవా
ఖరీఫ్‌లో ఎంటీయూ 1318 వరి వంగడాన్నే సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా డెల్టా ప్రాంతాల్లో 50 శాతం ఈ వంగడం సాగుకు సిద్ధమయ్యారు. 8లో



అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి
అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లను రూ.24 కోట్లతో అభివృద్ధి చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ డి.దినేష్‌కుమార్ చెప్పారు. 8లో

న్యూస్‌రీల్

మత్స్యావతారంలో జగన్నాథుడు



ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా తొలిరోజున జగన్నాథుడు ఆలయ కల్యాణ మండపంలో మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శంఖు, చక్రాలను ధరించి భక్తులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్టుగా ఉన్న స్వామివారి రూపం భక్తులకు కనువిందు చేసింది. ఈ నెల 17 వరకు రోజుకో విశేష అలంకారంలో దర్శనమిచ్చే స్వామివారిని భక్తులు దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ఈఓ కోరారు.

చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం : రాష్ట్ర స్థాయి అండర్–19 చెస్ పోటీలకు నలుగురు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. భీమవరం అనసూయ చెస్ అకాడమీలో జిల్లా అండర్–19 చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 86 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఎస్.వరుష్ తేజ్, ఎ.శివ సాయికార్తిక్, ఈ.దేవాన్ష్, ఎస్.కుష్వంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన కలెక్టర్



కేంద్ర మంత్రి వర్మకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను ఆదివారం కలెక్టర్ సి.నాగరాణి భీమవరంలోని మంత్రి ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

పశ్చిమలో 431.4 మి.మీ వర్షపాతం నమోదు

భీమవరం: జిల్లాలోని 20 మండలాల పరిధిలో ఆదివారం 434.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 78.8 మిల్లీమీటర్లు నమోదు కాగా, పెనుమంట్రలో 9.6, పెనుగొండలో 12.2, ఆచంటలో 8, పోడూరు 11.2, మొగల్తూరు 18.4, నర్సాపురం 24.2, పాలకొల్లు 20.4, యలమంచిలి 20.2, గణపవరం 24.2, ఆకివీడు 8.4, ఉండి 7.2, పాలకోడేరు 12.4, వీరవాసరం 14.2, భీమవరం 26.8, కాళ్ల 4.2, పెంటపాడు 57.2, తణుకు 25, అత్తిలి 26.4, ఇరగవరం 22.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏలూరులో జిల్లాలో సాధారణ వర్షపాతం

ఏలూరు (మెట్రో): జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షపాతం నమోదవుతోంది. జూలైలో భారీ స్థాయిలో వర్షాలు కురవాల్సి ఉన్నప్పటికీ సాధారణ వర్షపాతమే నమోదవుతోంది. ప్రస్తుతం జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో 23.7 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 28 మండలాల్లో భీమడోలు మండలంలో అత్యధికంగా 78.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా ముదినేపల్లి మండలంలో 0.4 మి.మీ నమోదైంది.

నిను మరువలేం రాజన్నా



ఉమ్మడి పశ్చిమ ప్రజల మదిలో ఆయన స్థానం సుస్థిరం... దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు ఐదేళ్లలో పరిష్కారం చూపారు. సుస్థిర అభివృద్ధి ద్వారా శాశ్వత ప్రయోజనాలు చేకూరతాయనే మహాసంకల్పంతో జిల్లాలో కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. పోలవరం ప్రాజెక్టు మొదలుకుని జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా ఉద్యాన యూనివర్సిటీ ఏర్పాటు ఘనత ఆయనదే. మెట్ట ప్రాంతంలో 100 పడకల ఆసుపత్రులు, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిపుత్రులకు పోడుభూములపై హక్కు కల్పించడంతో పాటు పట్టాలిచ్చింది ఆయన హయాంలోనే. జిల్లా అభివృద్ధి దశను, దిశను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మార్చారు. సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులతో పాటు అభిమానులు వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లాలో దివంగత వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తే..

- ఉమ్మడి పశ్చిమ మదిలో మహానేత సుస్థిరం
- పోలవరం ప్రాజెక్టుతో డెల్టా అభివృద్ధికి బీజం
- ఏలూరు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం
- గూడెంలో ఉద్యాన వర్సిటీ, నూజివీడులో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు కృషి
- పేదలకు ఇళ్ల పట్టాలు, గిరిజనులకు పోడుభూముల పంపిణీ
- చింతలపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం
- నేడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి



ఏలూరులో ఆరోగ్యశ్రీలో చికిత్స పొందిన చిన్నారిని పలుకరిస్తున్న వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పోలవరం ప్రాజెక్టు కోసం పరితపించిన వైఎస్సార్.. దానికి సంబంధించి అన్ని అనుమతులు తీసుకువచ్చారు. పోలవరం కుడి, ఎడమ కాల్వలను అత్యధిక శాతానికి పైగా పూర్తి చేశారు. ప్రాజెక్టును కార్యరూపంలో పెట్టే సమయంలో ఆయనను ప్రమాదం పొట్టన పెట్టుకుంది. నేడు పోలవరం ప్రాజెక్టు ఈ దశకు చేరుకుందంటే అది వైఎస్సార్ చూపిన చొరవే కారణం. ప్రాజెక్టులో స్పిల్ కాంక్రీట్ పనులు పూర్తి చేయడం, 48 రేడియల్ గేట్ల ఏర్పాటు, రివర్స్ స్లూయిజ్ గేట్ల నిర్మాణం, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి, గ్యాప్–3 వద్ద కాంక్రీట్ పనులు, పవర్‌హౌస్‌లో సొరంగం తవ్వకాలు, అప్రోచ్ చానల్ పనుల్లో ప్రాజెక్టు కీలక పురోగతి చూస్తే అందరికీ ఆయనే జ్ఞాపకం వస్తారు. దీంతో పాటు 12,658 కుటుంబాలను తరలించి పునరావాసం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశారు. డెల్టాను ఆధునికీకరించడం ద్వారా ఆయకట్టు స్థిరీకరణ జరగాలని భావించారు. వందల కోట్ల రూపాయలతో డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి రైతన్నకు భరోసా అందించారు.



పోలవరం ప్రాజెక్ట్

ప్రాజెక్టులతో సాగుకు భరోసా

జిల్లాలో 2004లో పోలవరం ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. రూ.10,151 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించి ఎడమ, కుడికాలువ నిర్మాణం, పునరావాసం ఇలా పనులను విభజించారు. తదనంతర కాలంలో పాలకులు ప్రాజెక్టు నిర్మాణంలో చూపిన నిర్లక్ష్యంతో పనులు నెమ్మదించాయి. ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 2019–24 వరకు యుద్ధ ప్రాతిపదికన కీలక పనులు జరిగాయి. అలాగే జిల్లాకు మరో కీలక ప్రాజెక్టుగా ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకానికి 2008 అక్టోబర్ 30న కామవరపుకోటలో వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి భూసేకరణ కొంతమేర పూర్తి చేసి కాలువ నిర్మాణాలు పూర్తి చేశారు. రూ.58 కోట్ల వ్యయంతో కొవ్వాడ కాలువలపై ఔట్‌ఫాల్ స్లూయిజ్, రూ.26 కోట్లతో పాగొండ రిజర్వాయర్, కొండకాలువలపై రూ.26 కోట్ల వ్యయంతో హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణం ఆయన హయాంలోనే జరిగాయి.



ఏలూరులో ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి సీఎం వైఎస్సార్ (ఫైల్)

తమ్మిలేరు ముంపు నుంచి విముక్తి

ఏలూరు ప్రజల దుఃఖదాయిని తమ్మిలేరు వరదల నుంచి విముక్తి కల్పించారు. 2005లో వరదలు వచ్చినప్పుడు స్వయంగా పరిశీలించిన వైఎస్ మొదటి దశ పనులకు రూ.17 కోట్లు, తరువాత రూ.90 కోట్ల నిధులు మంజూరు చేసి ఏటిగట్లను పటిష్టం చేసి ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపించారు. 100 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

అర్హత కలిగిన నిరుపేదలకు భూములు, ఇళ్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అర్హత కలిగిన నిరుపేదలకు 30 వేల ఎకరాలు భూపంపిణీ చేసిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుంది. పశ్చిమ ఏజెన్సీలో గిరిజన సన్న, చిన్నకారు రైతులకు 6 వేల ఎకరాలకు పట్టాలిచ్చి సాగుకు ప్రోత్సహించారు. ఇక గిరిజనులకు శాశ్వత భూహక్కు కల్పించారు. 4,500 ఎకరాల పోడు భూములను 2,200 గిరిజనులకు పంపిణీ చేసి సాగుదిశగా ప్రోత్సహించారు. ఆ భూముల్లో 350 ఉచిత బోర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ భూముల్లో మొక్కజొన్న, వరి, పొగాకు సాగవుతోంది. నూజివీడులో నాలుగువేల మందికి నివేశన స్థలాలను ఇచ్చి ఎమ్మార్ అప్పారావు కాలనీని ఏర్పాటు చేయడంతో పాటు అందరికి నాలుగు వేల ఇళ్లు మంజూరు చేశారు. నర్సాపురంలో అక్కడి పేద ప్రజలకు గూడు కల్పించడానికి రూ.10 కోట్లతో సుమారు 600 మందికి ఇళ్లు నిర్మించారు. ఇవి కేవలం మచ్చుతునకలు మాత్రమే. జిల్లాలో ఏ ప్రాంతంలో అడుగు వేసినా వైఎస్ తాలూకు అభివృద్ధి మార్కు స్పష్టంగా కనిపిస్తుంది. అందుకనే జిల్లాను ఆయన మానసపుత్రిగా అభివర్ణించడంలో సందేహించాల్సిన పనే లేదు.

యూనివర్సిటీల సృష్టికర్త

నూజివీడు ట్రిపుల్ ఐటీ, తాడేపల్లిగూడెంలోని ఉద్యాన యూనివర్సిటీ రెండూ కూడా మహానేత వైఎస్సార్ హయాంలోనే జీవం పోసుకున్నాయి. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి హార్టీకల్చర్ యూనివర్సిటీగా తాడేపల్లిగూడెం మండలంలోని వెంకట్రామన్నగూడెంలో 220 ఎకరాల విస్తీర్ణంలో 2007లో ఏర్పాటు చేశారు. రూ.40 కోట్ల ప్రాథమిక వ్యయంతో ఏర్పాటు చేసి అంచెలంచెలుగా అభివృద్ధి చేయడంతో నేడు దేశ వ్యాప్తంగా ఉద్యాన రైతులకు సేవలు అందించే స్థాయికి వర్సిటీ ఎదిగింది. వర్సిటీ ద్వారా 14 ఉద్యాన పంటలకు సంబంధించి 23 వంగడాలు ప్రాచుర్యంలోకి రావడంతో పాటు రైతులకు మంచి లాభాలను అందిస్తున్నాయి. నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ 120 ఎకరాల విస్తీర్ణం కలిగిన విశాల ప్రాంగణంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజినీరింగు విద్యను అందించడానికి సకల సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ మొదటి రెండు సంవత్సరాలు పీయూసీ విద్యను, మిగిలిన నాలుగేళ్లు ఇంజినీరింగు విద్యను అందజేస్తారు. విద్యార్థులకు విద్యను అందించడానికి పీయూసీ స్థాయిలో 75 మంది మెంటార్లు, ఇంజినీరింగు స్థాయిలో ఫ్యాకల్టీలు, గెస్ట్ లెక్చరర్లు కలిపి 150 మంది సిబ్బంది బోధన చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి ల్యాప్‌ట్యాప్‌ల ద్వారా విద్యాబోధన ఇక్కడి ప్రత్యేకత.



గూడెంలో వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ



నూజివీడులో ట్రిపుల్ ఐటీ

రావి ఆకుపై వైఎస్సార్ చిత్రం



ఏలూరు (టూటౌన్): దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని పురస్కరించుకుని రావి ఆకుపై ఆయన చిత్రాన్ని గీసి అభిమానాన్ని చాటుకున్నాడు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు దొర శివప్రసాద్. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగానే తన కుమార్తెలు ఉన్నత చదువులు చదివారని గుర్తు చేసుకున్నారు. వారిలో ఒకరు వైద్య శాఖలో ఉద్యోగం చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తమలాంటి పేదవర్గాలకు వైఎస్సార్ దేవుడు అంటూ గుర్తు చేసుకున్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఆదివారం రాత్రి సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు, ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. న్యాయమూర్తి వెంట భీమడోలు కోర్టు జడ్జి టీఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్ ఉన్నారు.



జస్టిస్ మల్లికార్జునరావుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ డీఈఓ, ఏఈఓలు

శోభాయమానం.. రథయాత్ర

- లక్ష్మీపురం ఆలయంలో ఘనంగా ప్రారంభం
- ద్వారకాతిరుమల క్షేత్రానికి అట్టహాసంగా రథోత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో జగన్నాథుడి దివ్య రథోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఏటా రథయాత్రను అట్టహాసంగా నిర్వహిస్తారు. లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఈ రథయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా ఆలయ సిబ్బంది రథన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడి దారు విగ్రహాలను అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి, రథంలో వేంచేపు చేసి, విశేషంగా అలంకరించారు. ఆలయ డీఈఓ బాబురావు, ఏఈఓ వాసు, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ, సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ రథం ముందుగా ఆలయం చుట్టూ తిరిగింది. ఆ తరువాత అశేష భక్తజనం, కోలాట భజనల నడుమ ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంది.



భక్తజనం నడుమ ద్వారకాతిరుమల క్షేత్రానికి వెళ్తున్న రథం





రథంలో ఆసీనులైన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడి దారు విగ్రహాలు, కోలాట నృత్యాలు

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం



చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఉంగుటూరు: ఉచిత ఇసుక విధానాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆదివారం ఉంగుటూరు మండలం చేబ్రోలులోని ఇసుక స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ పరిశీలించారు. స్టాక్ పాయింట్ వద్ద నిల్వవున్న ఇసుకను గనులశాఖ అధికారుల సమక్షంలో పరిశీలించారు. చేబ్రోలు ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక నిల్వచేసేందుకు సమీపంలోని నిడదవోలు రీచ్‌లో గాని, కుక్కునూరు మండలంలోని రీచ్ నుంచి గాని ఇసుకను స్టాక్ పాయింట్‌కు రప్పించుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, స్టాక్ పాయింట్ వద్ద ఫెన్సింగ్ వేయించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు, వాహనాల రాకపోకలకు ముఖద్వారం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధరల సూచిక బోర్డు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఒక వ్యక్తి ఆధార్‌కు 20 టన్నుల ఇసుక మాత్రమే అందజేయాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద తరచూ తహసీల్దార్లు, రెవిన్యూ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇసుక స్టాక్ పాయింట్ పంపిణీకి సంబంధించిన సమాచారాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ ఎస్ఎస్‌కె.ఖాజా వలి, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, గనుల శాఖ ఏడీ జి.సునీల్ బాబు తదితరులు ఉన్నారు.

ఇసుక రీచ్‌ల తనిఖీ

కుక్కునూరు: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం నుంచి నూతన ఇసుక విధానం అమల్లోకి రానుందని జేసీ బి.లావణ్య వేణి చెప్పారు. ఆదివారం ఆమె జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్యతో కలిసి వింజరం, ఇబ్రహీంపేట గ్రామాల్లో ఇసుక రీచ్‌లను పరిశీలించారు. స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ ఉంచిన ఇసుకను అంచనా వేసి రెవెన్యూ సిబ్బందికి అప్పగించాలని సాంకేతిక సిబ్బందిని ఆదేశించారు. ఇసుక రీచ్ నుంచి డిపో వరకు ఇసుక తేవడం, స్టాట్యూటరీ చార్జీలు, మెట్రిక్ టన్నుకు లోడింగ్ చార్జీలు, సీనరేజి చార్జీలు ఉంటాయని, అదనంగా జీఎస్టీ ఉండవచ్చని చెప్పారు. ఆధార్ కార్డు అనుసంధానంగా రోజుకి ఒకరికి 20 మెట్రిక్ టన్నుల ఇసుకను ఇస్తారని చెప్పారు. కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపట్నం, వింజరం, దాచారంలో, వేలేరుపాడు మండలంలో రుద్రంకోట -1, రుద్రంకోట-2 లో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయన్నారు. గోదావరి వరదలు సంభవిస్తే నిర్వాసితులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మూడు నెలలకు సరిపోయే విధంగా కివ్వాక ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిల్వ ఉంచిన బియ్యం బఫర్ నిల్వల స్టాక్ పాయింట్‌ను జేసీ పరిశీలించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భజంత్రీ శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 24 నుంచి మూడురోజుల పాటు మదనపల్లిలోని హార్సీలీ హిల్స్‌లో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కూనపాముల విఘ్నేష్, భజంత్రీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయం స్ఫూర్తి భవనం నందు యూనియన్ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు విఘ్నేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల్లో మున్సిపల్ రంగంలో పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలో జరగబోయే మౌలిక మార్పుల పట్ల, కార్మికుల విధుల పట్ల అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. కార్మిక, ఉద్యోగుల ఐక్యత, వారి వ్యతిరేక విధానాలు, తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు, సంయుక్త కార్యదర్శి జోగి ప్రభాకరరావు, కార్యవర్గ సభ్యులు యలగాడ శివకుమార్ పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: కడుపునొప్పి తాళలేక సక్కు మురళి (19) ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన పట్టణంలో టిడ్కో గృహాల సముదాయంలో జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఆదివారం స్థానిక పెంకుళ్లపాడు టిడ్కో గృహాల సముదాయంలో నివాసం ఉంటున్న సక్కు శ్రీను, కుమారి దంపతులు పట్టణంలో లాకు సెంటర్ వద్ద కాఫీ హోటల్ నడుపుకుంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మురళి గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం కడుపు నొప్పి తట్టుకోలేక గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి భోజనానికి పిలవడానికి తలుపు తట్టగా ఎంతసేపటికీ తలుపు తీయకపోవడంతో తలుపు పగలగొట్టి గదిలో చూసేసరికి మురళి ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించారు. వెంటనే స్థానికుల సహకారంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు ఎస్సై బి శ్రీనివాసు కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్‌లో అడ్మిషన్లకు రంగం సిద్ధం

- జిల్లాలో 15 ఇంజినీరింగ్ కళాశాలలు
- అందుబాటులో సుమారు 12 వేల సీట్లు
- కన్వీనర్ కోటాలో 8,500, మేనేజ్‌మెంట్ కోటాలో 3,600 సీట్లు
- 17వ తేదీ నుంచి 22 వరకు కళాశాలల్లో చేరికలు
- 19 నుంచి తరగతుల ప్రారంభం



భీమవరం: ఇంజినీరింగ్ అడ్మిషన్లకు కళాశాలలు సిద్ధమవుతున్నాయి. ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యామండలి ర్యాంకులను ప్రకటించడంతో రిజిస్ట్రేషన్లు, వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో సుమారు 15 ఇంజినీరింగ్ కళాశాలల్లో దాదాపు 12 వేల సీట్లకు గాను 8,500 కన్వీనర్ కోటా, 3,600 వరకు మేనేజ్‌మెంట్ కోటా సీట్లు ఉన్నాయి. కళాశాలలో ప్రవేశాల కోసం ఈ నెల 1వ తేదీన రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా, 10వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్స్ జరుగుతాయి. అలాగే 8 నుంచి 12వ తేదీ వరకు ఐచ్ఛికాల ఎంపిక, మార్పులకు 13వ తేదీ, 16న సీటు కేటాయింపు, 17 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు కళాశాలలో జాయిన్ కావడానికి అవకాశముంది. ఈనెల 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ర్యాంక్ ఆధారంగా సీట్ల భర్తీ

ర్యాంక్ ఆధారంగా సీట్ల భర్తీ ప్రక్రియ జరుగుతుంది. బీటెక్‌లో ప్రవేశాల కోసం ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు నచ్చిన బ్రాంచ్, కళాశాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఎంపిక సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రధానంగా బ్రాంచ్ ఎంపికలోనూ కచ్చితమైన నిర్ధారణకు రావాలి.

అటానమస్ కళాశాలల్లో పెరగనున్న సీట్లు

ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు సాధించలేకపోయామనే భయం అవసరం లేదు. ఈ ఏడాది ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎత్తివేసింది. దీంతో అటానమస్ కళాశాలలు అదనపు సెక్షన్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. అదనపు సీట్ల కోసం ఆయా కళాశాలలు ఏఐసీటీఈ దరఖాస్తు చేసుకుంటే సీట్ల పెంపుదలపై నిర్ణయం తీసుకుంటారు. దీంతో అన్ని బ్రాంచ్‌లలో సీట్లు పెంచుకునే అవకాశం ఏర్పడింది.

కౌన్సెలింగ్‌కు అవసరమైన ధ్రువపత్రాలు ఇవే

ఏపీ ఈఏపీసెట్–2024 ర్యాంకు కార్డు, హాల్ టికెట్, ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన పరీక్ష మార్కుల జాబితా, పుట్టిన తేదీ ధ్రువపత్రం కోసం టెన్త్ మార్కుల జాబితా, బదిలీ సర్టిఫికెట్ (టీసీ), స్టడీ సర్టిఫికెట్స్ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు, ఆర్థికంగా వెనుకబడినవారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్–2025 వ్యాలిడిటీ (ఓసీ విద్యార్థులు), బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలు.

విద్యార్థి ఆసక్తిని బట్టి బ్రాంచ్ ఎంపిక



విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇతరులెవరో చెప్పారని బ్రాంచ్‌లను ఎంపిక చేసుకుని చేరిన తర్వాత పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి పెట్టకపోతే లక్ష్యాన్ని సాధించలేరు. ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌లకు మార్కెట్లో డిమాండ్ ఉంది. విద్యార్థి ఎంపిక చేసుకున్న బ్రాంచ్‌లో రాణిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేటివ్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఫలానా బ్రాంచ్‌లోనే బీటెక్ చేయాలి అంటూ విద్యార్థులపై ఒత్తిడి చేయడం కంటే విద్యార్థి అభిరుచి, ఆసక్తిని పరిగణనలోనికి తీసుకుని చేర్పించడం మంచిది.

– నూకల గోపాలకృష్ణ, టెక్నాలజీ సెంటర్ హెడ్, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం

10న దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



సీఐటీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): నరేంద్ర మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ విధానాలు నిలిపివేయాలని కోరుతూ ఈనెల 10న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ్యాప్తంగా డిమాండ్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్లుగా దేశ్యాప్తంగా కార్మిక వర్గం చేపట్టిన పోరాటాల ఫలితంగా మోదీ ప్రభుత్వానికి పార్లమెంటులో సీట్లు తగ్గాయన్నారు. ఇప్పటికైనా లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కీలకమైన రైల్వే, బీఎస్ఎన్ఎల్, బీమా, బ్యాంక్ వంటి రంగాలను ప్రైవేట్‌పరం చేసే ఆలోచనలు కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 10న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిర్వహించనున్న డిమాండ్స్ డే కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జి.రాజు, ఎం.నాగమణి, బి.సోమయ్య, వి.సాయిబాబు, కె.విజయలక్ష్మి, ఎస్‌కే సుభాషిణి, ఆర్‌వీఎస్ నారాయణ, నారపల్లి రమణ, ఎస్.రాంబాబు, ఎం.దుర్గారావు, వై.సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఎంటీయూ 1318 వంగడానిదే హవా!

- డెల్టాలో 50 శాతం సాగు
- ముందుకొస్తున్న పీఎల్‌పీ (పూళ్ల) 1100 వంగడం
- సెలినిటీని తట్టుకొంటుంది స్వర్ణ



నారుమడి దశలో ఎంటీయూ 1318 వంగడం సాగు



గత ఖరీఫ్‌లో అధిక దిగుబడిలో పండిన ఎంటీయూ 1318 వంగడం

ఆకివీడు: ఖరీఫ్ సాగుకు విస్తృత స్థాయిలో రైతులు సన్నాహాలు చేస్తున్నారు. జూలై నెల నుంచి వాతావరణం అనుకూలించడంతో రైతులు పంట కాల్వలపై ఆధారపడకుండా దమ్ము పనులు, నారు మడుల పనుల్ని వేగవంతం చేశారు. పలుచోట్ల నారు పోశారు. వాతావరణం మరో మూడు రోజులు ముసురుగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆనందంతో ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

స్వర్ణకు ప్రత్యామ్నాయం ఎంటీయూ 1318

ఉండి నియోజకవర్గంలోని రైతులు అధిక శాతం ఎంటీయూ 1318 రకం వంగడం సాగు చేపడుతున్నారు. మార్టేరు వరి పరిశోధనా సంస్థ స్వర్ణ వంగడానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 వంగడాన్ని రూపొందించింది. తక్కువ నత్రజనితో, కాండం బలంగా ఉండటమే కాకుండా పడిపోయే స్వభావం లేదు. తెగుళ్లను తట్టుకుంటుంది. గింజ రాలదు. నూక శాతం బాగా తక్కువ. స్వర్ణ కంటే 10 నుంచి 15 శాతం అధిక దిగుబడినిస్తుంది. మినీ కిట్లను విజయవంతంగా ముగించుకుని సాగుకు సిద్ధమైన ఈ వంగడం దోమ పోటు, అగ్గి, ఎండాకు తెగుళ్లను పాక్షికంగా తట్టుకుంటుంది. 150 రోజుల కాలపరిమితితో అధిక దిగుబడులనిస్తుంది. మధ్యస్థ సన్నాలుగా, తెల్లగా పచ్చి బియ్యానికి అనుకూలంగా వంగడం ఉంటుంది.

సేంద్రియ సాగు భేష్

సాధారణ సాగుతోపాటు, సేంద్రియ సాగుతో ఈ వంగడం అధిక దిగుబడినిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నారుమడుల దగ్గర నుంచి, సాగు పూర్తయ్యే వరకూ సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండించడం ద్వారా నాణ్యమైన గింజ లభిస్తుంది. సేంద్రియ సాగుతో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి.

ఇతర వంగడాలూ సాగు

ఖరీఫ్‌లో స్వర్ణతో పాటు ఎంటీయూ 1061, 1064, పీఎల్‌పీ (పూళ్ళ) 1100 వంగడాల్ని రైతులు సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. పూళ్ళ వంగడం ముంపును తట్టుకుంటుందని, వర్షాలకు పడిపోకుండా నిలబడుతుందని, మధ్యస్థ సన్నాలుగా బియ్యాన్ని తినేందుకు ప్రజలు ఇష్టపడటంతో సాగుకు ముందుకు వస్తున్నారు. వీటితోపాటు సెలనిటీని తట్టుకునే ఎంసీఎం(మచిలీపట్నం) 100 వంగడాన్ని అక్కడక్కడా సాగు చేస్తున్నారు.

మంత్రి నిమ్మల శ్రమదానం



టిడ్కో గృహాల సముదాయంలో శ్రమదానం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పెంకుళ్లపాడు ప్రాంతం టిడ్కో గృహాల సముదాయంలో ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలు 90 శాతం పూర్తి చేశామని అన్నారు. మిగిలిన పది శాతం పనులు పూర్తిచేసి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వికసించిన నాగమల్లి



కన్నాపురంలో నాగమల్లి వృక్షానికి విరబూసిన పుష్పాలు



సృష్టిలో అరుదైన వాటికి పుట్టినిల్లు పుడమి తల్లి. ఆ పుడమి తల్లి నుంచి జనియించిన పుష్పవృక్షాలలో నాగమల్లి వృక్షానికి ప్రత్యేక విశిష్టత ఉంది. చెట్టు మొదలు నుంచి కొమ్మల వరకు పుష్పించడం దీని ప్రత్యేకత అయితే, పువ్వులోని ఓ భాగం శివలింగాకృతిలో ఉండగా దానిపై సర్పం మాదిరిగా పుష్పంలోని మరికొంత భాగం ఉండడం మరో విశిష్టత. కొయ్యలగూడెం మండలం కన్నాపురంలోని అటవీశాఖ కార్యాలయంలో ఉన్న ఈ నాగమల్లి పుష్ప వృక్షం గత మూడు దశాబ్దాలుగా జ్యేష్ఠ, ఆషాఢ మాసాల్లో విరబూస్తూ చూపరులను ఆకర్షిస్తుంటుంది. పుష్పాలను తరచూ కోయకపోవడం వలన సుదీర్ఘకాలం పాటు దశాబ్దాల పాటు పుష్పించడానికి కారణమైందని ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేర్కొంది. ఈ వృక్షానికి ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు తీసుకుంటూ అటవీశాఖ సిబ్బంది కాపాడుతూ వస్తున్నారు.

– కొయ్యలగూడెం

అమృత్ భారత్ స్టేషన్‌లుగా అభివృద్ధి

దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) దినేష్ కుమార్

తణుకు టౌన్: అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లను రూ.24 కోట్లతో అభివృద్ధి చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) డీ దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రాత్రి తణుకులో జరిగిన రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, వాటికి లిఫ్ట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టేషన్‌లలో ఆధునిక లైటింగ్‌లతో హాల్స్ నిర్మాణం, లేడీస్ వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్ల నిర్మాణం, బేబీ ఫీడింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సౌకర్యాలు స్టేషన్ బయట రూపురేఖలను చూడముచ్చటగా తీర్చిదిద్దడం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్ విధానంలో తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం రైల్వే స్టేషన్‌లలో స్టాల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీని వలన బడుగు, బలహీన వర్గాలకు చెందిన చిరు వ్యాపారులకు రైల్వే స్టేషన్‌ల ప్లాట్ ఫారాలపై తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు స్థలాలను కేటాయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు రైల్వే స్టేషన్‌లో కూడా ఆధునిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా తణుకు రైల్వే స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫాంపై టికెట్ బుకింగ్ కౌంటర్, స్టేషన్ ఎదుట రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రైల్వే ఆపరేషన్స్ మేనేజర్ వీ కృష్ణప్రసాద్, తణుకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు(బాబీ), కార్యదర్శి కఠారి సిద్ధార్థ, సీనియర్ రొటేరియన్లు గమిని రాంబాబు, వీ హనుమంతరావు, డాక్టర్ కే సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



టాస్ వేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం (టీటీసీ): క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, తాడేపల్లిగూడెంలో క్రికెట్ క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తామని గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో వాకర్స్ గ్రౌండ్‌లో ఆదివారం వానపల్లి సుధాకర్ టెన్నిస్ బాల్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను టాస్ వేసి ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలకు వెళ్లేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించిన నిర్వాహకులు తుమరాడ చిన్న, సలాం, కరీంలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ పోటీల్లో పీకేఎల్ టీం విజేతగా నిలిచింది. క్రీడాకారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ స్టెల్లా కాలేజ్ (ఉమెన్స్) విజయవాడలో B.Sc. ఫోరెన్సిక్ సైన్స్ / అగ్రికల్చర్ / AI & ML / మెడికల్ ఇమేజింగ్ (రేడియాలజీ); BBA - 3 సం॥ల కోర్సులు. అర్హత : ఇంటర్. UGC & కృష్ణా యూనివర్సిటీ గుర్తింపు. హాస్టల్ కలదు. సంప్ర : 84658 74867, 99121 78237 [V- 2624]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6817]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2545]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Wanted

■ Wanted Administration & Front Office Executives(Female Only) Qlf: Degree /MBA /B.Tech, Age Limit : 30 to 45 Years. Location :Bhimavaram Branch.Cont: 8885112000. [NA-11148]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185241]

■ కన్సల్టెన్సీ కాదుVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. 7995365999 [HA-339]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185263]

■ RK ఇంజనీరింగ్ కాలేజీలో వంట చేయుటకు వంట మాస్టర్స్ మరియు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్క్ చేయుటకు అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్స్ ప్లంబర్స్ వెంటనే కావలెను. మంచిజీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. సంప్ర: కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. సెల్. 97014 73399 [G-120]

సినిమా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI
విశాఖపట్నం జోన్, పెంటపాడు బ్రాంచ్

సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

ఋణగ్రహీత : శ్రీ గిద్ద త్రిమూర్తులు, తండ్రి. సత్యనారాయణ, 3-53, గిద్ద వారి వీధి, కాస్పా పెంటపాడు గ్రామం, పెంటపాడు మండలం, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా–534166.
హామీదారు : శ్రీమతి కరుమంచి వాణిశ్రీ, తండ్రి. వెంకట రాధాకృష్ణ, 36-92-103/18, వినాయక గుడి దగ్గర, ఇందిరా నగర్, ఊర్వశి జంక్షన్, విశాఖపట్నం (అర్బన్), విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్–530008.
లోన్ అకౌంట్ నెంబర్ : 563075110000239
ఋణం యొక్క స్వభావం : హోమ్ లోన్, మంజూరు అయిన పరిధి : రూ.10,00,000/-,
బకాయి మొత్తం : రూ.9,70,700.02 పై + తేది.13.06.2024 వడ్డీతో కలిపి
చెల్లించవలసిన బాకీ మొత్తము : రూ.9,70,700.02 పై (అక్షరాల తొమ్మిది లక్షల డెబ్భై వేల ఏడు వందల రూపాయల రెండు పైసలు మాత్రమే) + 13.06.2024 నుండి @ 8.95% నెలవారీ వడ్డీతో పాటు వర్తించే వడ్డీ మరియు కాస్ట్స్, ఛార్జీలతో సహా.

స్థిరాస్తి వివరములు

పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు సబ్ రిజిస్ట్రీ, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలం, కాస్పా పెంటపాడు గ్రామం, డి.నెం.3-53/1, ఆర్.ఎస్.నెం.52/1 వద్ద గల విస్తీర్ణం 121 చ॥గజములలోని సమాన నిష్పత్తిలో తనఖా ఉంచబడిన నివాసయోగ్యమైన ఇల్లు శ్రీ గిద్ద త్రిమూర్తులు గారి పేరున కలదు. హద్దులు : తూర్పు : రాజ వీధి, దక్షిణం : గత్తెం కోటయ్య గారి స్థలం, పడమర : వీరబత్తుల గణపతిరావు గారి స్థలం, ఉత్తరం : వీరబత్తుల శ్రీనివాస రావు గారి స్థలం.

పైన చెప్పబడిన ఋణగ్రహీతలు బ్యాంక్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం జోన్, పెంటపాడు బ్రాంచ్ వారి నుండి పైన పేర్కొన్న అన్ని క్రెడిట్ సౌకర్యాలను పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చి యున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలననుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము తేది.13.06.2024 న నిరర్ధక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకు వారు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించిన తేది.25.06.2024 నాటి డిమాండ్ నోటీసు చిరునామాదారుడు అచ్చట లేనందున / నోటీసు తీసుకొనుటకు నిరాకరించినందున ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది. సదరు ఋణగ్రహీతలు పైన పేర్కొన్న మొత్తములను ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 08.07.2024
ప్రదేశం : పెంటపాడు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ)
పాలకొల్లు బ్రాంచ్. డి.నెం. 14-4-20, కానూరి కాంప్లెక్స్, మెయిన్ రోడ్డు, పాలకొల్లు-534260, పశ్చిమగోదావరి జిల్లా. ఫోన్: 08814-222112, ఇ-మెయిల్: iob2602@iob.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్ చేసిన, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారిచే లాంఛనంగా/భౌతికంగా స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు రావలసిన బకాయి (ప్రతి అకౌంట్‌కు దిగువన తెలుపబడినది) దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏది ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 13.08.2024, ఉ॥ 11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
ఇ-వేలం ప్లాట్‌ఫాం: https://ebkray.in/eauction-psb/bidder-registration
ధరావత్తు సొమ్ము సమర్పించుటకు ఆఖరు తేది: 12.08.2024, సా॥ 4.00 గం.లలోపు

1 ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారు(లు): 1. శ్రీమతి గవర శ్రీలక్ష్మీ, భర్త: గవర శంకరరావు, డి.నెం 26-5-4, 3వ వీధి, ఎస్ఎమ్ఎమ్ డిగ్రీ కాలేజ్ దగ్గర, 12వ వార్డు, సూర్యతేజస్ నగర్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా–534260 (ఋణగ్రహీత/తనఖాదారు) మరియు 2. శ్రీ గవర శంకర్ రావు, తండ్రి: రెడ్డియ్య, డి.నెం 26-5-4, 3వ వీధి, ఎస్ఎమ్ఎమ్ డిగ్రీ కాలేజ్ దగ్గర, 12వ వార్డు, సూర్యతేజస్ నగర్, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా–534260 (సహ-ఋణగ్రహీత/హామీదారు). బకాయి మొత్తం: తేది. 05.07.2024 నాటికి బకాయి రూ. 8,16,368.86/- (ఎనిమిది లక్షల పదహారు వేల మూడు వందల అరవై ఎనిమిది రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు

పాలకొల్లు ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం. 3738/1999 తేది.16.10.1999 ప్రకారం శ్రీమతి గవర శ్రీలక్ష్మీ పేరునగల ఆస్తి: ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు ఎస్ఆర్ఓ, పాలకొల్లు రెవెన్యూ మండలం, పాలకొల్లు రూరల్ పంచాయితీ, ఆర్.ఎస్.నెం. 369, ఆర్.ఎస్.నెం. 376-6, ఆర్.ఎస్. నెం: 367-1, 376-2బి, ఓ.ఆర్.నెం. 61, తేది. 30-07-1985 ఆమోదిత లే-అవుట్ ప్రకారం ఎ. 9-05 సెంట్లను ఇంటి స్థలాలుగా మార్చబడిన తరువాత ప్లాట్ నెం. 19 మొత్తం విస్తీర్ణం 225-5-00 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: 24 అ॥ వెడల్పు లే-అవుట్ రోడ్డు 51 '-0", దక్షిణం: 24 అ॥ వెడల్పు లే-అవుట్ రోడ్డు 40'-0", పడమర: ప్లాట్ నెం. 18 స్థలం 50'-6", ఉత్తరం: 3'-0" పంట బోదె & 31/2 '0" వెడల్పు లే-అవుట్ ఎగ్జిక్యూటింగ్స్ స్థలం 40'-0". అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో.

రిజర్వు ధర: రూ. 30,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 3,00,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 50,000/-

2 ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారు(లు): 1. శ్రీ గార్లపాటి నాగుల్ మీర, తండ్రి: జన్నీన, డి.నెం. 4-153/11, ఆర్.ఎస్.నెం. 199/1, మసీదు దగ్గర, మసీదు వీధి, పూలపల్లి గ్రామం గ్రామపంచాయితీ, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534260 ... (ఋణగ్రహీత & తనఖాదారు), 2. శ్రీమతి గార్లపాటి అస్మా, భర్త: గార్లపాటి నాగుల్ మీర, డి.నెం. 4-153/11, ఆర్.ఎస్. నెం. 199/1, మసీదు దగ్గర, మసీదు వీధి, పూలపల్లి గ్రామం గ్రామపంచాయితీ, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534260 (సహ-ఋణగ్రహీత). బకాయి మొత్తం: తేది. 05.07.2024 నాటికి రూ. 33,79,723.43/- (అక్షరాల ముప్పై మూడు లక్షల డెబ్బై తొమ్మిది వేల ఏడు వందల ఇరవై మూడు రూపాయలు మరియు నలభై మూడు పైసలు) + తదుపరి వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు

పాలకొల్లు ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం. 3174/2015 తేది.19.06.2015 ప్రకారం గార్లపాటి నాగుల్ మీర, తండ్రి: గార్లపాటి జన్నీన పేరునగల ఆస్తి: ఆంధ్రప్రదేశ్-534260, పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, పూలపల్లి గ్రామపంచాయితీ మరియు గ్రామం, మసీదు దగ్గర, మసీదు వీధి, డోర్ నెం. 4-153/11, ఆర్.ఎస్. నెం. 199/1, మొత్తం 121.00 చ॥గ॥ స్థలంలోని రెసిడెన్షియల్ బిల్డింగ్ (గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ అంతస్తు). హద్దులు: తూర్పు: అంగర రవి కుమార్ స్థలం, దక్షిణం: 12' వెడల్పు పంచాయితీ రోడ్డు, పడమర: షేక్ మదీనా సాహెబ్ ప్రహరీ గోడ, ఉత్తరం: చెరుకూరి సూరపరాజు భూమి.

రిజర్వు ధర: రూ. 33,05,000/- ధరావత్తు సొమ్ము: రూ. 3,30,500/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 50,000/-

*స్థానిక ప్రభుత్వ బకాయిలు (ఆస్తి పన్ను, నీటి పన్ను, కరెంటు బిల్లు మొ॥): బ్యాంకుకి తెలియదు. *చట్టబద్ధ బకాయిల కన్నా బ్యాంక్ బకాయిలకు ప్రాధాన్యత ఉంటుంది.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌లో ఏర్పాటుచేసిన https://ebkray.in, https://eprocure.gov.in/epublish/app లేదా బ్యాంక్ వెబ్‌సైట్ https://www.iob.in లింక్‌ను రిఫర్ చేయండి.
మరిన్ని వివరములకు దయచేసి సంప్రదించండి: 08814-222112
తేది : 06.07.2024, స్థలం: పాలకొల్లు
సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

క్లుప్తంగా

జగన్నాథస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక 26వ వార్డు జూబ్లీ రోడ్డులో జగన్నాథ, సుభద్ర నిలయంలో ఆదివారం ఆషాఢ శుద్ధ విదియ సందర్భంగా శ్రీ జగన్నాథస్వామి వారికి విశేష పూజలు జరిగాయి. నిర్వాహకులు ఎస్.విశ్వ మోహన్ రావు పర్యవేక్షించారు. స్వామివారికి అష్టోత్తర, సహస్ర నామార్చనలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ లేక అవస్థలు



అత్తిలి సంతానగోపాలస్వామి ఆలయం వద్ద రోడ్డుపై చేరిన వర్షం నీరు

అత్తిలి: కురుస్తున్న వర్షాలకు అత్తిలి గ్రామంలో పలు పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షం నీరు రోడ్డుపైకి చేరుతోంది. అత్తిలి సంతానగోపాలస్వామి ఆలయ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారులు అసౌకర్యానికి గురౌతున్నారు. ఈప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించినప్పటికీ, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో వర్షం వస్తే నీరు నిలిచిపోతుంది. ఈ రోడ్డుమార్గంలో వెళ్లే వాహనాల నీటిలోనుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ఇంటి గోడలపైకి నీరు చిమ్ముతోందని స్థానికులు వాపోతున్నారు. పల్లపు ప్రాంతంగా ఉన్న ఈ ప్రదేశంలో వర్షం నీరు బయటకు వెళ్లే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడిగా రంగా ఎన్నిక



రంగాను అభినందిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు

పాలకోడేరు: మండల ఆర్య వైశ్యసంఘం అధ్యక్షునిగా పెన్నాడ కు చెందిన అక్షింతల రంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన పేరును సోము వెంకట్రావు ప్రతిపాదించగా, శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా బలపర్చగా, మిగిలిన గ్రామ సంఘాలు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా రంగా మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. తనను మండల సంఘానికి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సంఘం నాయకులు కె రఘురాములు, కోడూరి కుమార్‌లు ఈ ఎన్నికను నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం అందజేత



వడలిలో శ్రీ మందాలమ్మ ఆలయకమిటీకి విరాళం అందజేస్తున్న అత్యం మధువంశీ

పెనుగొండ: వడలి గ్రామంలో శ్రీ మందాలమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన అత్యం నాగేశ్వరరావు కుమారుడు మధువంశీ ఆదివారం రూ.47,251 విరాళం అందజేశారు. మధువంశీ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇటీవలే ఉద్యోగంలో చేరారు. తన మొదటి జీతాన్ని ఆయన అమ్మవారి ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబాన్ని మందాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. వీరి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని అమ్మవారి ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందజేయాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.

వర్గీకరణ సాధనే లక్ష్యం

మొగల్తూరు: ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు మాదిగలంతా ఒకేతాటిపై ఉండాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కోడెల్లి వెంకట్రావు కోరారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం పేరుపాలెం సౌత్‌లో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకుడు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో బ్రహ్మయ్య చేపట్టిన ప్రతి కార్యక్రమంలో కలిసకట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉల్లంపర్తి బులినర్సు మాదిగ, కారుమించి కృపాల్, కొండేటి సామ్యూల్ రాజు, లక్కువరుపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెం అభివృద్ధిలో వైఎస్సార్ ముద్ర

నేడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి



గూడెంలో ప్రసంగిస్తున్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి(ఫైల్)

తాడేపల్లిగూడెం: చెప్పాడంటే చేస్తాడంతే అనే పేరొందిన మహనీయుడు, దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి. మహానేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనా సమయంలో గూడెం అభివృద్ధి ప్రగతి పథంలో పయనించింది. 2004 నుంచి 2009 వరకు ఐదేళ్ల కాలంలో గూడెం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ సారధ్యంలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. దేశంలో రెండవదైన ఉద్యానవిశ్వవిద్యాలయం వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటైంది. విద్యాభివృద్ధికి ఏయు క్యాంపస్, వెటర్నరీ, పాలిటెక్నిక్ వచ్చాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పట్టణంలో రూ.35 కోట్లతో రెండవ ఫ్లైవోవర్ వంతెనను కట్టారు. రైతుల సమస్య పరిష్కారానికి గాను వీరంపాలెం, మాధవరం–కంసాలిపాలెం, అప్పారావుపేట–కోరుమామిడి వంతెనలు నిర్మించారు. ఎర్రకాల్వ వరద నివారణకు రామరాజుగట్టు, బాపన్నకోడు చెక్ డ్యామ్‌ల పునః నిర్మాణం జరిగింది. పేదలకోసం రాజీవ్ గృహకల్ప కింద 280 ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కింద పట్టణంలో 480 ఇళ్లు కట్టారు. సదుపాయాల కల్పన జరిగింది. వైఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని స్మరణకు తెచ్చుకుంటూ ఆయనను సదా స్మరించుకుంటున్నారు.



రెండవ ఫ్లైవోవర్ వంతెన(ఫైల్)



రాజీవ్ గృహకల్ప సముదాయం (ఫైల్)

రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి



నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్

అత్తిలి: నారుమడి ఏర్పాటులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన నారుని పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మండలంలోగల పలు నారుమడులను ఆయన పరిశీలించారు. చలి ఎక్కువగా ఉండే దాళ్వా వరి సాగులో జింకులోప లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పు న వేయాలన్నారు. వరినాట్లు వేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కాండం తొలిచే పురుగు ఆకు చివర గుడ్లు పెడుతుందని, నారు నాటే సమయంలో కొసలు విరిచి నాటాలన్నారు. దీంతో గుడ్లు నిర్మూలించి పురుగు ఉధృతి తగ్గించవచ్చన్నారు. మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలన్నారు. నారు తీసేసమయంలో మొక్కలు లేతాకు పచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరుగుతుందని, నాలుగు నుంచి ఆరు ఆకులున్న నారును ఉపయోగించాలని చెప్పారు. ముదురునారు నాటితే దిగుబడి తగ్గుతుందని, నాటు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చ. మీ.కు 33 మూనలు ఉండేటట్లు చూడాలన్నారు. నాటిన అనంతరం ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ బాటలు తీయడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి, చీడపీడల ఉధృతి కొంతవరకు అదుపు చేయవచ్చన్నారు. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు వేయడానికి, పైరు పరిస్థితిని గమనించడానికి ఈబాటలు బాగా ఉపయోగపడతాయని ఏఓ రాజేష్ వివరించారు.

నంది నాటకోత్సవాలు పాలకొల్లులో నిర్వహించాలి

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో నిర్మాణంలో బొండాడ వెంకట్రాజు గుప్త, ఎన్టీఆర్ కళాక్షేత్ర నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఈ ఏడాది ఆ కళాక్షేత్రంలో నంది నాటకోత్సవాలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కళాకారులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని పట్టణ నటీ నట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కళాకారులు కలిసి వినతిపత్రం అందజేశారు. పాలకొల్లులో కళాకారులకు నాటిక రిహార్సల్స్ చేసుకోవడానికి, అలాగే కళాసంస్థలు నాటిక పోటీలు నిర్వహించుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. నటీనట సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు వంగా నరసింహరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుడాల హరిబాబు, ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు, రాజా తాతయ్య, గంగా రామమోహన్ రావు, శివాల రామారావు, పుచ్చల నాగలింగేశ్వర రావు, గంటా ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో భక్తుల రద్దీ



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

మోళ్లపర్రులో..

మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లో వేంచేసియున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ఆదివారం వేకువ జాము నుంచి వారాహి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో నక్షత్ర ధోషాలు, కార్యసిద్ధి దుష్టగహ నివారణకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నిర్వహించిన పంచామృతాభిషేకంలో గ్రామస్తులు నాగిడి రంగారావు, సత్తినేని సర్వేశ్వరరావు, మేళం రంగనాథ్, నేదునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వారాహి అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యాసామగ్రి కొనుగోలు సందడి



తణుకులో బ్యాగ్‌లు అమ్మే దుకాణం



తణుకులో కిక్కిరిసిన పుస్తకాల దుకాణం

- పుస్తకాలు, స్కూల్ బ్యాగ్స్ కొనుగోళ్లు
- రద్దీగా మారిన దుకాణాలు

తణుకు అర్బన్: విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో విద్యాసామగ్రి కొనుగోలు చేసేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, షూస్ అమ్మకాలు చేసే దుకాణాలతో పాటు యూనిఫామ్ కోసం వస్త్ర దుకాణాలు కూడా రద్దీగా మారాయి. 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఉపాధ్యాయులు చెప్పిన ప్రకారం టెక్ట్స్, నోటు పుస్తకాలు కొనుగోలుతో పాటు స్కూల్ బ్యాగ్‌లు కొనుగోలు చేసేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఆదివారం కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులను తీసుకుని మార్కెట్‌కు రావడంతో సంబంధిత దుకాణాలన్నీ కిక్కిరిశాయి. తణుకు రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, పాతవూరు ప్రాంతాల్లో ఉన్న పుస్తక, స్కూల్ బ్యాగ్ దుకాణాల్లో సందడిగా మారింది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితం...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా టెక్ట్స్, నోటు పుస్తకాలు, యూనిఫామ్, స్కూల్ బ్యాగ్‌లు, షూస్ వంటి సామగ్రి గత ప్రభుత్వ హయాం నుంచి కూడా ఉచితమే కావడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అదనంగా కొనుగోలు చేసే ఇబ్బంది రాలేదు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం వారి వద్దే పుస్తకాలు విక్రయాలు చేస్తున్నప్పటికీ కొందరు తల్లిదండ్రుల మాత్రం మార్కెట్‌లోనే పుస్తకాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్



వల్లూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుగొండ: విద్యార్థులకు విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందని వల్లూరు గ్రామసర్పంచ్ నేలపూడి బేబీ రామ్మోహనరావు అన్నారు. వల్లూరులో మహిళా జూనియర్ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. సభకు సర్పంచ్ బేబీ రామ్మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నత విద్యను అభ్యసించి మంచి మంచి ర్యాంకులతో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో లక్షలు లక్షలు ఫీజులు కట్టి చదివినా చివరకు ఎటువంటి ఉద్యోగాలు లేక ఇంటి దగ్గరే ఖాళీగా ఉంటున్నారన్నారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీధర నర్సింహ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులు ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధిండంపై సంతోషం వ్యక్తం చేస్తూ ఆయా విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను సర్పంచ్ బేబీ రామ్మోహనరావు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమలాపురం సర్పంచ్ గుబ్బల మాధవరావు, పాఠశాల చైర్మన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ దొరబాబు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆరుమిల్లి సుబ్బారావు, ఉప సర్పంచ్ గెద్దాడ శ్రీనివాసరావు, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు నేలపూడి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో 78.8 మి.మీ వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్‌మండలంలో గడిచిన 24గంటల్లో 78.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. పెంటపాడు మండలంలో 57.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

పెనుమంట్ర: రాష్ట్రంలో చేనేత కార్మికులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సూర్యభాస్కరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెనుమంట్ర మండలం మార్టేరులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను జిల్లాలో ప్రతినియోజకవర్గంలో పర్యటిస్తున్నానని, చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వం నుంచి చేతి వృత్తిదారులకు రావాల్సిన రాయితీలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కులస్తులు అధికంగా ఉన్నారని, ప్రభుత్వం గుర్తించి చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు.

లేటెస్ట్ టెక్నాలజీ అధ్యయనం చేయాలి

భీమవరం: వేగంగా మారుతున్న లేటెస్ట్ టెక్నాలజీని ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు అధ్యయనం చేసి విద్యార్థులకు అందించాలని ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ నిపుణుడు ఉమా దేసు అన్నారు. భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఏఐఎంఎల్ విభాగం, సీఎస్సీ డిపార్ట్‌మెంట్ల సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులు పాటు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాంప్ట్ ఇంజినీరింగ్ అనే అంశంపై వారం రోజులు పాటు జరిగిన వర్క్ షాప్ ఆదివారం ముగిసింది. వర్క్ షాప్‌నకు ఏఐ ఎంఎల్ హెడ్ డాక్టర్ జీఎస్‌పీజీ శిరీష అధ్యక్షత వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఐ నిపుణులు ఉమా దేసు మాట్లాడుతూ గతంలో టెక్నాలజీ మార్కెట్లోకి వచ్చేసరికి చాలా టైం తీసుకునేదని ప్రస్తుతం ఎంతో వేగంగా టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధ్యాపకులు నిరంతరం నూతన టెక్నాలజీ వైపు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు ఏఐ నిపుణులు ఉమా దేసును ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు, ట్రిపుల్ ఐటీ డెవలప్మెంట్ ఇంజినీర్ పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారంతో ఆరోగ్యం

- పొంచి ఉన్న వ్యాధుల కాలం
- జాగ్రత్తలు పాటించకుంటే అంతే
- బలవర్ధమైన ఆహారంతో పాటు పరిశుభ్రత ముఖ్యం



పెంటపాడు: వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకపోతే రోగాలబారిన పడకతప్పదు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోగ నిరోధశక్తి పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, సరైన ఆహార అలవాట్లు లేకపోవడం వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే ఎక్కువ మంది వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసరాల పరిశుభ్రతతోపాటు పౌష్టికాహారం ఆవశ్యకతను ప్రజలకు వైద్యాధికారులు వివరిస్తున్నారు. వీలైనంతవరకు నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలి. రడీమేడ్ ఆహారం, ఫ్రిజ్‌లో నిల్వ ఉన్న కూల్ డ్రింక్‌లు ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజు వారి ఆహారం ఇలా...

ఉదయం 2 ఇడ్లీలు లేదా 60గ్రాములు గింజ ధాన్యాలు, 25గ్రాములు పప్పు ధాన్యాలు, 15మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. 11గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో లేకపోతే గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్న భోజనంలో 75గ్రాములు గింజ ధాన్యాలతో చిరుతిండి, కప్పుడు పాలు తాగాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా చపాతి లేదా పుల్కా కూరగాయలతో కూడిన కూరను తీసుకోవాలి. ప్రతి రోజు 150మిల్లీ లీడర్ల పాలు తీసుకోవాలి. టీ, కాఫీ అవసర్లున్న వారు రోజులకు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తాగాలి

పప్పు ధాన్యాలు

ఆహారంలో పప్పులు, మినుములు, శనగలు, బాదంపప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజు ఏదో ఒక ఆకుకూర 100గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామి, ఉసిరి, నిమ్మ, ఏదో ఒకటి తప్పనసరిగా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్ లేదా మటన్ తీసుకోవాలి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు అల్లం, వెల్లుల్లిబాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడి పాటు, వేడి నీరు, టీలో కలుపుకొని తాగితే ఉపశమనం కలుగుతోంది.

ఆహారపు అలవాట్లు

ప్రతి పూట భోజనాకి ముందు తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకుంటే వ్యాధులు దరిచేరవు. ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం, కొంచెం ప్రతి మూడు గంటలకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం. రోజు తినే ఆహారంలో తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో తీసుకోవచ్చును.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం, పప్పు ధాన్యాలు వంటి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా బాగా ఉడికించిన ఆహారం తీసుకోవాలి. విటమిన్లు ఉన్న ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటాం.

– డాక్టర్ తోట రాజేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి పెంటపాడు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395
తణుకు: 90108 43311, 90100 51493

Office mail : tpgadvt@gmail.com